సాక్షి నిజామాబాద్

మంగళవారం। 13। మే। 2025



బుద్ధుడి బోధనలు..

విశ్వశాంతిని ఆకాంక్షించిన గౌతమ బుద్ధుడి బోధనలు అనుసరణీయమని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



ప్రజావాణికి 121 ఫిర్యాదులు

ప్రజావాణిలో 121 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.8 /24.1

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షలు 16 నుంచి ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ (2020 నుంచి 2024 బ్యాచ్‌లకు) 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన విధంగా ఈ నెల 14న ప్రారంభం కావాల్సిన డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను అనివార్య కారణాలతో 16వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. తెయూ పరిధిలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 32 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 24,500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac. inను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

'ఏకలవ్య'లో ఖాళీ సీట్ల భర్తీ

ఇందల్‌వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఏకలవ్య మోడల్ స్కూల్ గాంధారి (బాయ్స్), ఇందల్‌వాయి (గర్ల్స్)లలో 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకోసం ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇందల్‌వాయి) ప్రిన్సిపల్ రమేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధారిలో బైపీసీలో 23, సీఈసీలో 14 ఖాళీలు, ఇందల్‌వాయిలో బైపీసీలో 15, సీఈసీలో 18 సీట్లు ఖాళీ ఉన్నట్లు వివరించారు. పదో తరగతి మెరిట్, నెస్ట్ అడ్మిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

న్యాయవాదులకు అండగా 'ఇల్పా'



ఖలీల్‌వాడి: న్యాయవాద వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఇల్పా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజ్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం ఆయన న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో ఎదిగేందుకు అవసరమైన అన్ని రకాల శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సామాజిక నిర్మాతలుగా ఉండి ప్రజోపయోగ కార్యక్రమాలలో భాగస్వాములమవుతామని పేర్కొన్నారు. కష్ట కాలంలో ఉన్న న్యాయవాదులకు, వారి కుటుంబాలకు ఇల్పా అండగా ఉంటుందని చెప్పారు. బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, ఏ ఆంజనేయులు, ఎస్ జే శ్యాంసన్, కె. వెంకటేశ్వర్‌ప్రసాద్, ఏ సురేశ్, న్యాయవాదులు బాస రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య, ఆశ నారాయణ, రంజిత్ సుతారి, బైర గణేశ్, ఆరేటి నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు

- ఈ నెల 31 వరకు అవకాశం

నిజామాబాద్ సిటీ: ఎల్‌ఆర్‌ఎస్‌పై గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ద్వారా అనధికార లేఅవుట్‌లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. మార్చి 31 గడువు తేదీగా ఉండగా మూడు రోజులు పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి గడువును పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో నం.97 జారీచేసింది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించింది. జిల్లాలో ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కింద 33,793 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇప్పటివరకు 9,258 మంది ఫీజు చెల్లించి తమ ప్లాట్లను రెగ్యులర్ చేసుకున్నారు. మరో 3,886 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఈ పథకాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

డీసీసీ పీఠం రేసులో ఆశావహులు

- పోటీలో శేఖర్‌గౌడ్, వేణుగోపాల్‌యాదవ్, కాటిపల్లి నగేష్‌రెడ్డి
- 2018 తరువాత పార్టీలోకి వచ్చినవారికి అవకాశాల్లేవని చర్చ
- పీసీసీ కార్యవర్గంలోకి వెళ్లేదెవరు..?
- స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఆలస్యం నేపథ్యంలో నాయకుల్లో డైలమా
- పీసీసీ అధ్యక్షుడి సొంత జిల్లా కావడంతో పదవుల పంపకాలపై ఆసక్తి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికార పార్టీ కాంగ్రెస్‌లో జిల్లా అధ్యక్ష పదవి కోసం రేసు పెరిగింది. ఎవరికివారు సైలెంట్‌గా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో డీసీసీ పీఠం కోసం డిమాండ్ పెరిగింది. దీంతో ఈ పీఠం దక్కించుకునేందుకు నాయకులు రేసుగుర్రాల మాదిరిగా పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ సంస్థాగత పటిష్టతపై కచ్చితత్వంతో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, ప్రజాప్రతినిధుల కంటే పార్టీ సారథులకే జిల్లాలో ప్రాధాన్యం ఉంటుందని మీనాక్షి నటరాజన్ ప్రకటించడంతో ఈ పీఠంపై అందరి దృష్టి పడింది. దీంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. పైగా పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో డీసీసీ పీఠం ఎవరికి కేటాయిస్తారనే విషయమై అన్నివర్గాల్లో ఆసక్తి నెలకొంది. అదే విధంగా పీసీసీ కార్యవర్గంలోకి ఎవరిని తీసుకుంటారనే విషయమై సైతం చర్చ నడుస్తోంది. అయితే జిల్లాకు చెందిన సీనియర్లలో పలువురికి రాష్ట్ర కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఇంకా మరికొందరు సీనియర్ నాయకులు రాష్ట్ర కార్పొరేషన్ పదవుల కోసం పట్టుబడుతున్నారు. కాగా మిగిలిన నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఆలస్యం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం కారణంగా జెడ్పీ పీఠం ఆశిస్తున్న నాయకులు సైతం డీసీసీ పీఠం రేసులోకి రావడం గమనార్హం.

■ డీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి దక్కించుకున్నారు. దీంతో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నం చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్న బాడ్సి శేఖర్‌గౌడ్ డీసీసీ రేసులో ముందంజలో ఉన్నారు. సీనియర్ నాయకుడు మార చంద్రమోహన్ జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన బాస వేణుగోపాల్‌యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కాటిపల్లి నగేష్‌రెడ్డి రేసులో పరుగెత్తుతున్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి సైతం రేసులో ఉన్నారు. నరాల రత్నాకర్ కూడా ఆశిస్తున్నారు. డీసీసీ పీఠాన్ని బీసీలకు కేటాయిస్తారా.. ఓసీలకు కేటాయిస్తారా అనే విషయమై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు డీసీసీ పీఠాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి సైతం ఆశిస్తున్నప్పటికీ 2018 తరువాత వచ్చినవారికి ఈ పదవి ఇవ్వకూడదనేది పార్టీ నిర్ణయించినట్లు టాక్ నడుస్తోంది. ఇదిలా ఉండగా పార్టీ పటిష్టత లక్ష్యంగా ముందుకెళుతున్న మీనాక్షి నటరాజన్ ఆలోచన ప్రకారం చూస్తే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కూడా ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇక పీసీసీ కార్యవర్గం పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి ఢిల్లీ వెళ్లి పార్టీ నాయకత్వానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రతిపాదనలు అందించారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఏమేరకు పనిచేశారనే విషయమై పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

నేడు పాలిసెట్



నిజామాబాద్ అర్బన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) నేడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగనుంది. మొత్తం 16 సెంటర్లలో 6542 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు. నిర్ణీత సమయానికి గంటముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎగ్జామినేషన్ కన్వీనర్ శ్రీనివాస్ సూచించారు.

ఆదాయం ఐదింతలు

- కర్బూజ సాగుతో లాభాలు ఆర్జిస్తున్న రైతు గోక భోజారెడ్డి



డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయంలో శ్రమతో పాటు పట్టుదల ఉంటే అద్భుత లాభాలు సాధించొచ్చని డొంకేశ్వర్‌కు చెందిన గోక భోజారెడ్డి మరోసారి నిరూపించారు. పసుపు సాగులోనే కాదు కాలానికి అనుగుణంగా కూరగాయలు, పండ్లు పండిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఈ ఏడాది పసుపు పంటను తీసిన తర్వాత కర్బూజ (పుచ్చకాయ) సాగు చేశాడు. ఎకరం ఇరవై గుంటల్లో ఈ పంటను వేయగా 65 రోజుల తర్వాత మంచి దిగుబడి వచ్చింది. ఒక్కో కాయ 5 నుంచి 10 కిలోల వరకు పెరిగింది. వ్యాపారులే తోట దగ్గరికి వచ్చి టన్నుకు రూ.7,500 చెల్లించి పుచ్చకాయలను తీసుకెళ్లారు. మొత్తం 40టన్నులకు పైగా కర్బూజ దిగుబడి రాగా రూ.3 లక్షల వరకు డబ్బు చేతికి వచ్చింది. అయితే కేవలం రూ.60వేల పెట్టుబడి పెట్టిన భోజారెడ్డి ఐదింతల ఆదాయాన్ని పొందాడు. గత పదేళ్లుగా వేసవికి ముందు కర్బూజ పంటను సాగు చేస్తూ వస్తున్నాడు. పసుపు తీసిన భూమిలోనే కర్బూజ వేయడంతో మంచి దిగుబడి వస్తోందని, అందుకే ప్రతి ఏడాది సాగు చేస్తున్నట్లు రైతు భోజారెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

'మోడల్'లో ఇంటర్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 20 వరకు గడువు
- ఒక్కో పాఠశాలలో 160 సీట్లు
- ఉమ్మడి జిల్లాలో 16 మోడల్ స్కూళ్లు



డిచ్‌పల్లిలోని మోడల్ స్కూల్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఇంటర్మీడియెట్ ఆంగ్లమాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూల్) ఓ వరం. 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 20 వరకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 26న మెరిట్ లిస్టు, 27 నుంచి 31 వరకు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. మోడల్ స్కూల్‌లో ఇంటర్‌తోపాటు ఎంసెట్, నీట్ కోచింగ్‌కు అవకాశం కల్పించారు.

సీట్ల కేటాయింపులు ఇలా

కేటగిరి	సీట్లు	జనరల్	బాలికలు
జనరల్	20	13	07
ఎస్సీ	06	04	02
ఎస్టీ	02	01	01
బీసీ- ఏ	03	02	01
బీసీ- బీ	04	03	01
బీసీ-సీ	00	00	00
బీసీ- డీ	03	02	01
బీసీ-ఈ	02	02	00

ప్రతి గ్రూప్‌లో 40 సీట్లు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 16 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులున్నాయి. ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున ఒక్కో పాఠశాలలో 160 సీట్లు కేటాయించారు. ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంటుంది. అందుకు కనీసం 3 కిలోమీటర్లు, ఆపై దూరంగా ఉండేవారు మాత్రమే అర్హులుగా అధికారులు పేర్కొన్నారు. అడ్మిషన్స్ కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ యూఆర్‌ఎల్ అడ్రస్.. http://183.82.97.97/mstg

దరఖాస్తు చేసుకోవాలి



మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆంగ్ల మాధ్యమంలో మెరుగైన విద్యాబోధన, లైబ్రరీ, గేమ్స్, వొకేషనల్ ట్రైనింగ్, కంప్యూటర్ విద్య అందుబాటులో ఉంటుంది.పదో తరగతి ఫలితాల్లో వచ్చిన మార్కులు, మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలుంటాయి.

– దశరథ్, ప్రిన్సిపాల్, డిచ్‌పల్లి మోడల్ స్కూల్

అటకెక్కిన విజిలెన్స్ విచారణ


- బాల్కొండ నియోజకవర్గంలో కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలు
- విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు



తొర్తి, శెట్‌పల్లి చెక్‌డ్యాం ఎత్తును తగ్గిస్తున్న పొక్లెయిన్(ఫైల్)



వర్షాకాలంలో వరద తాకిడికి కొట్టుకుపోయిన సుంకెట్ చెక్‌డ్యాం(ఫైల్)



వరద తాకిడికి కొట్టుకుపోయిన పచ్చలనడ్కుడ చెక్‌డ్యాం కట్ట (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): రైతాంగానికి మేలు చేయాలనే సంకల్పంతో చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాల్లో పెద్ద మొత్తంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడంతో వరదల తాకిడికి చెక్‌డ్యాంలు కొట్టుకపోయి రైతులకు తీవ్రనష్టాన్ని చేకూర్చాయి. బాల్కొండ నియోజకవర్గంలోని పెద్దవాగు, కప్పల వాగులలో 12 చోట్ల చెక్‌డ్యాంలను నిర్మించగా, ఐదు చెక్‌డ్యాంలు వరద తాకిడిని తట్టుకోలేక కుంగిపోయాయి. కట్టలు తెగి పంట పొలాల్లోకి నీరు చేరింది. ఫలితంగా లక్షలాది రూపాయల ప్రజాధనం నీటి పాలైంది.

చెక్‌డ్యాంల పరిస్థితి ఇలా..

- వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌ల మధ్య 2019లో రూ.4.78 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాం నిర్మించారు. 3 మీటర్ల ఎత్తులో నిర్మించాలని నిర్ణయించగా అంచనా వ్యయం పెంచుకోవడానికి 4.1 మీటర్ల ఎత్తులో నిర్మించారు. వరద తాకిడిని అంచనా వేయకపోవడంతో మట్టి కట్టలు కూలిపోయి పంట పొలాలను నీరు ముంచెత్తింది.
- మోర్తాడ్ మండలం సుంకెట్ వద్ద రూ.9.38 కోట్లతో చెక్‌డ్యాం పనులు సకాలంలో పూర్తికాలేదు. దీంతో వర్షాకాలంలోనూ పనులు కొనసాగించాలని చూశారు. రెండుసార్లు చెక్‌డ్యాం కొట్టుకపోయి పంట పొలాలు నీటముసగడంతోపాటు ఇసుక మేటలు వేయడంతో ఒక్కో రైతు ఎకరానికి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది.
- మోర్తాడ్ మండలం పాలెం- ధర్మోరాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మట్టికట్ట కూలిపోయి పంటలు నీట మునిగాయి. ఇదే చెక్‌డ్యాం వద్ద కాజ్‌వే నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడంతో మూడు సార్లు కాజ్‌వే కుంగిపోవడం, కూలిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.
- ఏర్గట్ల మండలం తొర్తి, మోర్తాడ్ మండలం శెట్‌పల్లి మధ్య పెద్దవాగులో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.4.80 కోట్లు ఖర్చు చేశారు. 2.5 మీటర్ల ఎత్తులో నిర్మించాల్సిన చెక్‌డ్యాం ఎత్తును 4 మీటర్లకు పెంచారు. దీంతో నీటి నిలువ సామర్థ్యం ఎక్కువై పంట పొలాల్లోకి నీరు చేరింది. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు ఎలాంటి అనుమతులు లేకుండానే కట్ట ఎత్తును కుదించారు.
- భీమ్‌గల్ మండలం బెజ్జోరా వద్ద కప్పలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు అధికంగా ఉండటంతో పొలాలకు నీరు చేరి రైతులు సాగు చేసుకోలేని దుస్థితిలో ఉండిపోయారు.

నేతలదే హవా..

చెక్‌డ్యాంల నిర్మాణంలో ఇంజినీర్ల మాట కంటే అప్పటి అధికార పార్టీ నేతల మాటనే నెగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైడ్రాలిక్ అనుమతులు తీసుకోకపోవడం, సుమోటో అనుమతులతోనే చెక్‌డ్యాంలు నిర్మించడంతో ప్రకృతి ప్రకోపానికి రైతులు నష్టపోవాల్సి వచ్చింది.

తుది నివేదిక ఎక్కడ?

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెక్‌డ్యాంల నిర్మాణంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విభాగానికి ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన విజిలెన్స్ అధికారులు నీటి పారుదల శాఖ నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల బృందం చెక్‌డ్యాంలను పరిశీలించి వెళ్లింది. కానీ, ఇప్పటి వరకు తుది నివేదికను అందించకపోవడం గమనార్హం.

రైతులకు న్యాయం చేయాలి



చెక్‌డ్యాంల నిర్మాణంతో రైతులకు మేలు కంటే కీడు ఎక్కువ జరిగింది. అప్పట్లో అధికార పార్టీ నేతలకు విన్నవిస్తే వారు లెక్కచేయలేదు. రైతుల పట్ల దురుసుగా వ్యవహరించారు. విచారణ జరిపి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి.

– నవీన్ యాదవ్, రైతు, సుంకెట్

రాములోరి సేవలో సీపీ



సీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న డిచ్‌పల్లి ఖిల్లా వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య

డిచ్‌పల్లి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సోమవారం రాత్రి సందర్శించారు. ప్రతి పౌర్ణమి రోజు సీతారామ చంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను హనుమంతుడి వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపులో సీపీ పాల్గొన్నారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ ఆధ్వర్యంలో సీపీని ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

'అమ్మపాడే జోలపాట' ఫేంకు సన్మానం



సిరికొండ: 'అమ్మ పాడే జోల పాట' గాయని జాహ్నవి కొండూర్ గ్రామానికి సోమవారం వచ్చింది. బంధువుల పెళ్లికి వచ్చిన ఆమెను శివాలయం వద్ద పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. జాహ్నవి పాడిన పాట చాలా బాగుందని, హిట్ అయిందని అభినందించారు.

నూతన డిగ్రీ కోర్సులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా రెండు డిగ్రీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై వేణు ప్రసాద్ సోమవారం తెలిపారు. బీఎస్సీ(డిజిటల్ ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థులు దోస్త్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరానికి ప్రవేశం పొందాలని తెలిపారు.

రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలి



డిచ్‌పల్లి: పంటలపై రసాయన మందుల వాడకాన్ని నియంత్రించి సాగు ఖర్చు తగ్గించుకోవడంతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కృషి విజ్ఞాన కేంద్రం–రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని డిచ్‌పల్లి తండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, స్వప్న మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులోనే యూరియాను వినియోగించాలన్నారు. విత్తన, పురుగు మందులను కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదులను భద్రపరచి కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి గోపికృష్ణ, ఏఈవోలు సతీశ్, విలాస్, రూపేశ్, వంశీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం ఓ మహిళ తాను చనిపోతానంటూ పరుగెత్తడాన్ని గమనించిన స్థానిక వ్యాపారి పోలీసులకు సమాచారం అందించారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్ వెంటనే అప్రమత్తమై నిజాంసాగర్ ప్రధాన కాలువ వైపు పరుగెడుతున్న మహిళను పట్టుకొని నచ్చజెప్పి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. మహిళ ప్రాణాలను రక్షించిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

ప్రజావాణికి 121 ఫిర్యాదులు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు వివరించారు. ప్రజావాణికి వచ్చే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్

గోదావరి బ్రిడ్జి గోడ ఎత్తు పెంచాలి..

నవీపేట: యంచ శివారులోని గోదావరి నది బ్రిడ్జికి రెండు వైపుల ఉన్న గోడల ఎత్తును పెంచాలని గ్రామస్తులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం సమర్పించారు. ఎత్తు తక్కువగా ఉండడంతో నదిలో దూకి తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. ఆత్మహత్యల నివారణకు బ్రిడ్జి సమీపంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరారు.

ఎనిమిది కుటుంబాలకు సాంఘిక బహిష్కరణ

- బాధితుల్లో తాజా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ భర్త

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి గ్రామానికి చెందిన 8 కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు అకారణంగా సాంఘిక బహిష్కరణ చేసినట్లు బాధిత కుటుంబాలు పేర్కొన్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో, అనంతరం పోలీస్ కమిషనర్ సాయిచైతన్యను వేర్వేరుగా కలిసి బాధితులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం డిచ్‌పల్లి మండల కేంద్రంలో విలేకరులతో బాధితులు మాట్లాడుతూ.. గత ఏడాది సెప్టెంబర్ 15న గణేశ్ నిమజ్జనం సందర్భంగా తంగెళ్ల కిషన్, మాసిపెద్ది శ్రీనివాస్‌ల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుందన్నారు. తర్వాత మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు మిట్టాపల్లి గ్రామానికి చెందిన కంచెట్టి గంగాధర్ అండతో వీడీసీ సభ్యులు మున్నూరు కాపు కులానికి చెందిన ఎనిమిది కుటుంబాలను (తేలు గణేష్, తాజామాజీ సర్పంచ్), ఒడ్డం నర్సయ్య (మాజీ ఎంపీటీసీ భర్త), మాసిపెద్ది శ్రీనివాస్, తేలు గంగాధర్, మాసిపెద్ది రవి, గోపు రాజేశ్వర్, చిత్తపేట నడిపి గంగారాం, గోపు చరణ్) సాంఘిక బహిష్కరణ చేసినట్లు తెలిపారు. తమ కుటుంబాల్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు గ్రామంలోని ఇతర కులాల వారు హాజరు కావద్దని, ఎలాంటి సహకారం అందించవద్దని వీడీసీ సభ్యులు తీర్మానం చేసి ఈ మేరకు అన్ని కులాల వారికి హుకుం జారీ చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాల వారికి మాదిగలు డప్పు కొట్టడం లేదని, చాకలి వారు బట్టలు ఉతకడం లేదని, మంగలి వారు వెంట్రుకలు తీయడం లేదని, కుమ్మరి వారు కుండలు ఇవ్వడం లేదన్నారు. దీంతో గత పది నెలలుగా తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్‌లకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో తాము విధిలేక కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన విచారణ జరిపి తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బుద్ధుడి బోధనలు అనుసరణీయం



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్: విశ్వశాంతిని ఆకాంక్షించిన గౌతమ బుద్ధుడి బోధనలు అనుసరణీయమని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. నేటితరం యువత బుద్ధుడు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. సాలూర మండలంలోని హున్సా గ్రామంలో దళిత, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పంచశీల బుద్ధ విహార్ (గౌతమ బుద్ధుడి మందిరం)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మందిరంలో ఏర్పాటు చేసిన బుద్ధుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ,ఆయన సతీమణి రమాబాయి విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శంకర్, టీపీసీసీ డెలిగేట్ బీ గంగాశంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, సొసైటీ చైర్మన్లు అల్లె జనార్దన్, మందర్నా రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, మండల అధ్యక్షుడు గోపీకిషన్, బుద్ధ విహార్ కమిటీ ప్రతినిధులు శ్రీకాంత్, గౌతం, బాలాజీ, అలోక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వికసించిన 'మే' పుష్పాలు



నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్ నగర్ రోడ్డు నంబర్–10 ప్రాంతంలో నివసించే సేర్ల దయానంద్, భాగ్యలక్ష్మిల ఇంట్లో మే పుష్పాలు వికసించాయి. 15 ఏళ్ల నుంచి తమ ఇంట్లో మే పుష్పాలు వికసిస్తున్నాయని వారు తెలిపారు. 'మే' పుష్పాలను కాలనీవాసులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



భైరాపూర్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు

- హాజరైన వివిధ రాష్ట్రాల మల్లయోధులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని భైరాపూర్ పోచమ్మ తల్లి జాతర పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా ముగిశాయి. మహారాష్ట్రలోని నాందేడ్, నార్సితో పాటు ఆదిలాబాద్, నిర్మల్, గాంధారి, మోపాల్, రూరల్, వర్ని మండలాల నుంచి సుమారు వందమందికిపైగా మల్లయోధులు తరలివచ్చారు. వర్ని మండలం సిద్ధాపూర్‌కు చెందిన గోపాల్ తుది పోరులో విజయం సాధించి 5తులాల వెండి కడియాన్ని గెలుపొందారు.

తండా పెద్దలు గోపాల్‌కు కడియం బహూకరించారు. కుస్తీ పోటీలను తిలకించేందుకు మోపాల్‌తోపాటు చుట్టు పక్కల మండలాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రజలకు సేవలందించడంలో రెడ్‌క్రాస్ ముందుంటుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అభినందించారు. జాతీయ స్థాయిలో రెడ్‌క్రాస్ అవార్డు అందుకున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్‌ను సోమవారం కలెక్టర్ ప్రత్యేకంగా సత్కరించారు. రాజశేఖర్ చాలా ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ నివారణ సూచనల పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తూ సేవలు అందించడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, డీపీవో శ్రీనివాస్ రావు, డీఎంహెచ్‌వో రాజశ్రీ, టీఎన్జీవోస్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, కోశాధికారి కరిపె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



తోటరాజశేఖర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

వైభవంగా లక్ష్మీనృసింహుల కల్యాణం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను రథంలో ఊరేగించారు.

కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, శ్రీధర్ రావు,అర్చకులు డైరెక్టర్లు లక్ష్మి రాజం, రాజిరెడ్డి, ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఉసికే లక్ష్మణ్ (45) అనారోగ్య కారణాలతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై జానీబాష తెలిపారు. లక్ష్మణ్‌కు 8ఏళ్ల క్రితం పెద్దపేగు సర్జరీ జరిగిందని, నాటి నుంచి తరచూ నొప్పితో బాధపడుతున్నాడన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మణ్ ఇంట్లో నుంచి వెళ్లగా దోమకొండ శివారులోని కుడి చెరువులో శవం లభ్యమైందని తెలిపారు. మృతుడి భార్య భవానీ ఫిర్యాదుతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంతానం కావడం లేదని..

నిజామాబాద్ రూరల్: పెళ్లై 20 ఏళ్లు గడుస్తున్నా సంతానం కావడం లేదని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన సావిత్రికి వివాహం అయి 20 ఏళ్లు అవుతోంది. సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గతంలో ఆత్మహత్యకు యత్నించింది. ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిన సావిత్రి గ్రామ శివారులోని ఎర్రగుండ్ల చెరువులో దూకింది. సోమవారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఒకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని వాంబే కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన జొర్రీగల ఓం ప్రకాశ్ (51) ఓ కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు కూడా పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ప్రకాశ్ ఆదివారం రాత్రి బాత్రూంలో ఉపయోగించే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రకాశ్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దురలవాట్లకు బానిసై వివాహిత..

కామారెడ్డి క్రైం: దురలవాట్లకు బానిసై వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళి శ్రీవిద్య (23) కొంతకాలంగా భర్తతో గొడవపడి విద్యానగర్‌లోని తన సోదరి శ్రీమతితో కలిసి ఉంటోంది. చాలా రోజులుగా ఆమె కల్లు, గుట్కా, ఇతర చెడు అలవాట్లకు బానిసైంది. ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె సోమవారం వేకువజామున తిరిగి వచ్చి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఉదయం చూసే సరికి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరి శ్రీమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట: మండలంలోని అల్జాపూర్ శివారులోని గోదావరి నదిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి, సుమారు మూడు రోజుల కిందట మరణించి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. పాము కాటుకు బలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చేపలవేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృత్యువాత పడిన ఘటన నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని అచ్చాయపల్లి గ్రామానికి చెందిన బెస్త అశోక్(47)ఆదివారం గ్రామశివారులోని ఊర చెరువులో చేపలు పట్టేందుకు వల వేసి, చెరువు ఒడ్డున పడుకొని ఉండగా గుర్తు తెలియని పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే అశోక్‌ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో అశోక్ మృతిచెందినట్లు భార్య భారతి నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.



బెస్త అశోక్ (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ శివారులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన కోవత్రి గంగాధర్(46) మృతి చెందాడు. ఎస్సై యాసర్ ఆరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ సావెల్ గ్రామంలో తన బంధువు మైసమ్మ పండుగ చేయడంతో భోజనం కోసం వచ్చాడు. రాత్రి దోంచందకు బైక్‌పై తిరిగి వెళుతుండగా ఎదురుగా వెల్కటూర్ నుంచి సావెల్ వైపు వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి గంగాధర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య కోవత్రి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లిలో భోజనం చేస్తూ ఒకరి మృతి



నరేశ్ మృతదేహం

భిక్కనూరు: పెళ్లిలో భోజనం చేస్తూ కుప్పకూలి ఒకరు మృతి చెందిన ఘటన కాచాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గరిగంటి నరేశ్(33) స్నేహితులతో కలిసి మద్యం సేవించి కాచాపూర్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహానికి వెళ్లాడు. అక్కడ భోజనం చేస్తూ ఆకస్మికంగా కిందపడిపోయాడు. స్నేహితులు వెంటనే నరేశ్‌ను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అదుపుతప్పిన కారు

- పలు వాహనాలకు ఢీ
- 10 మందికి తప్పిన ప్రాణాపాయం

ఆర్మూర్‌టౌన్: అదుపు తప్పిన ఓ కారు వరుసగా వాహనాలను ఢీకొన్న ఘటన ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన కొంతమంది ఎర్టిగా కారులో ఆదివారం ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళుతున్నారు. ఆర్మూర్‌లోని దోండి మెడికల్ చౌరస్తా వద్ద అంక్సాపూర్‌కు చెందిన ప్రవీణ్ కారులో ఓ పేషెంట్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వేగంగా వచ్చిన ఎర్టిగా కారు ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా శ్రీనివాస్ మందుల దుకాణం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, అక్కడే నిలిపి ఉన్న ఓ బైక్‌తోపాటు ఓ స్కూల్ బస్సును కూడా ఢీకొట్టింది. ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోగా, అదృష్టవశాత్తు కారులో ఉన్న 10 మందికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



వాహనాలను ఢీకొని నిలిచిపోయిన కారు

ముంబై రోడ్లపై ఇందూరువాసి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ముంబైలోని విక్ రోలీ వెస్ట్ ఫుట్‌పాత్‌పై ఉన్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తి వాటర్, టీ తీసుకుంటున్నాడని, ఇంగ్లిష్ దినపత్రికలు చదువుతున్నాడని, అడ్రస్ అడిగితే నిజామాబాద్ అని చెబుతున్నాడని తెలిపారు. తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

'డయల్ 100'ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి జైలు

బోధన్: అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాల్సిన 'డయల్ 100'ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు టౌన్ సీఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. రాకాసీపేట ప్రాంతానికి చెందిన ఎండీ ఫారూఖ్ మద్యం మత్తులో డయల్ 100కు కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయడంతోపాటు దుర్వినియోగానికి పాల్పడినందున కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి శిక్ష విధించారని పేర్కొన్నారు. 'డయల్ 100'ను దుర్వినియోగం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ



బాధితురాలు లావణ్య

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జానకంపేట గ్రామానికి చెందిన మంగళి రవి కుటుంబం వేసవి ఉక్కపోత భరించలేక ఇంటి తలుపులు తెరిచి నిద్రించారు. దుండగుడు ఇంట్లోకి చొరబడి రవి భార్య లావణ్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెలతాడును కత్తిరించి, పుస్తెలను అక్కడే వదిలేసి గొలుసు ఎత్తుకెళ్లాడు. అలికిడి శబ్దం విన్న లావణ్య మేల్కొని అరవడంతో దొంగ పరారయ్యాడు. ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగదాంబ ఆలయంలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారం తండా పరిధిలో ఉన్న జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. పూజారి రమేశ్ సోమవారం ఉదయం పూజ చేసేందుకు ఆలయానికి వెళ్లగా తాళం పగిలి ఉంది. విషయాన్ని తండా పెద్ద మనుషులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. 16 తులాల వెండి, 5 గ్రాముల మంగళసూత్రం, 6 మాసాల పట్టగొలుసులు అపహరణకు గురైనట్లు పూజారి పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్, చుక్కపురం శంకర్, చింతలపల్లి గోవర్ధన్ రెడ్డిలకు చెందిన 15 కేవీ, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్ చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై ఏఈ పండరీనాథ్ సమక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని బాధితులు కోరగా పైఅధికారులకు నివేదిక అందించి, వారం రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందేలా చూస్తామని ఏఈ తెలిపారు.



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్